బోనాలకు ముస్తాబైన ఆలయాలు

రేపటి నుంచి ఉత్సవాలు

విద్యుత్ కాంతులతో ఏర్పాట్లు స్వాగత వేదికలు, దేవతామూర్తుల చిత్రాలు

మారేడ్‌పల్లి, జూలై 26 : ఈ నెల 28,29వ తేదీల్లో మారేడ్‌పల్లిలోని మైసమ్మ ఆలయం బోనాల ఉత్సవాలకు ముస్తాబైంది. అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు చిర్రబోయిన కృష్ణ యాదవ్, తిరుమల వంశీ ఏర్పాట్లు చేశారు. వారం రోజుల ముందు నుంచి మారేడ్‌పల్లి ప్రధాన, అంతర్గత రహదారులు కిలోమీటర్ పొడవున రంగు రంగుల బల్బులతో తయారు చేసిన వివిధ అమ్మవార్ల, దేవతా మూర్తుల రూపాలు ఆకర్షిస్తున్నాయి. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారమైన మారేడ్‌పల్లి మైసమ్మ అమ్మవారి ఆలయం విద్యుత్ కాంతులతో మిరుమిట్లు కొలుపుతున్నది. సికింద్రాబాద్ మహంకాళి బోనాల ఉత్సవాల తరహాలో మారేడ్‌పల్లి ఉత్సవాలను నిర్వహిస్తుండడం అనవాయితీగా వస్తున్నది. మొదటి రోజు బోనాలు, రెండో రోజు రాత్రి ఫలహారం బండిని డప్పు దరువుల మధ్య పోతరాజుల నృత్యాలతో మారేడ్‌పల్లి ప్రధాన రోడ్లు, పురవీధుల్లో శోభాయాత్రగా ఊరేగిస్తాయి. పుణే నుంచి వచ్చే డప్పు కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నట్లు, ఉత్సవాలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు వస్తారని వారు వెల్లడించారు.

లష్కర్ బోనాలు విజయవంతం

బేగంపేట్ : ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు ప్రభుత్వ శాఖలు, పోలీస్, వివిధ స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో విజయవంతమైంది. రెండు రోజుల పాటు జరిగిన ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సికింద్రాబాద్ పోలీసులు, ప్రభుత్వ శాఖల అధికారులు,స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ అధికార యంత్రాంగం.. స్వచ్ఛంద సంస్థలకు అభినందనలు

తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పే బోనాల ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేసిన విషయం తెలిసిందే. అమ్మవారికి బోనాల ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించినందుకు జీహెచ్ఎంసీ, రెవెన్యూ, జలమండలి,ఆర్ అండ్ బీ, వైద్య శాఖ, శానిటేషన్, పోలీస్, ట్రాఫిక్, కల్చరల్, ఎలక్ట్రిసిటీ విభాగాలతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలైన దక్కన్ మానవ సేవా సమితి, ఆర్యసమాజ్, స్కౌట్స్ సంస్థలతో పాటు బోనాల ఉత్సవాల ప్రాధాన్యతను దేశ విదేశాలలో తెలిసేలా కృషి చేసిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి, ఆలయ ఫౌండర్ సభ్యులు సురిటి కామేశ్ ప్రత్యేక అభినందలు తెలిపారు. ఫలహారపు బండ్లు ఊరేగింపులో ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు తగిన బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతర ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు, వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు సంతోషాన్ని వ్యక్తం చేశారని ఈవో మనోహర్‌రెడ్డి శుక్రవారం దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు.

ఆలయంలో కొలువుదీరిన మారేడ్‌పల్లి మైసమ్మ అమ్మవారు

ఉత్సవాలకు సిద్ధమైన భూలక్ష్మీ అమ్మవారి ఆలయం

ప్రకాశ్‌నగర్ రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన భూలక్ష్మీ అమ్మవారి ఆలయాన్ని బోనాల నేపథ్యంలో సుందరంగా తీర్చిదిద్దామని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం ఊరేగింపు ఘటాన్ని తొలిసారి తయారు చేశారు. ఘటాన్ని రెండు రోజులు ఊరేగించి, ఆదివారం 28న బోనాలు, రంగం నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త విశాల్ సుదం తెలిపారు. - బేగంపేట్

సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయంలో మాట్లాడుతున్న ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి, సురిటి కామేశ్

మెట్టుగూడలోని వీరమచనేని హైస్కూల్‌లో నిర్వహించిన బోనాల వేడుకల్లో కార్పొరేటర్ రాసూరి సునీత రమేశ్ పాల్గొన్నారు. స్కూల్ యజమాన్యం కార్పొరేటర్‌ను ఆహ్వానించి శాలువాతో సన్మానించారు. డప్పుచప్పుళ్లు, పోతురాజు నృత్యాల నడుమ విద్యార్థినిలతో కలిసి కార్పొరేటర్ చిలకలగూడలోని కట్టమైసమ్మ ఆలయంలో అమ్మవారికి బోనాలను సమర్పించి పూజలు చేశారు.

- అడ్డగుట్ట

అన్నిఏర్పాట్లు చేస్తున్నాం

బోనాలకు అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నామని మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత రమేశ్ అన్నారు. శుక్రవారం మెట్టుగూడ డివిజన్ పరిధిలోని చిలకలగూడ, దూద్‌బావి ప్రాంతాల్లో ప్రధానరోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్టుకొమ్మలను కార్పొరేటర్ ఆదేశాల మేరకు అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ సహకారంతో అన్నిఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రజలు ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని, బోనాలను తెలంగాణ రాష్ట్ర పండుగగా గుర్తించిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని తెలిపారు.

- అడ్డగుట్ట

రాంగోపాల్‌పేట్ కళాసీగూడలోని ముత్యాలమ్మకు వెండి ఘటాన్ని స్థానికంగా ఉండే వెంపటి విక్రాంత్, శ్రవణ్ కుటుంబ సభ్యులు తయారు చేయించారు. బోనాల సందర్భంగా అమ్మవారి ఆలయ నిర్వాహకులకు అందజేయనున్నామని తెలిపారు. - బేగంపేట్

ఇబ్బందులు కలుగకుండా..

అధికారులతో సమావేశమైన నీలిమ

అమీర్‌పేట్, జూలై 26 : ఈ నెల 28 జరిగే బోనాలను విజయవంతం చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ కోరారు. శుక్రవారం ఆమె సనత్‌నగర్ హనుమాన్ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. అర్చకులు, సిబ్బందితో ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఆర్థికసాయం అందజేసిన నేపథ్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని, భక్తుల తాకిడి అధికంగా ఉండే వీలున్నందున పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అర్చకులు పరాశరం రవీంద్రాచార్యులు, రిపుంజయ శర్మ, ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ గౌడ్, ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

మారేడ్‌పల్లి తహశీల్దార్‌గా భీమయ్య గౌడ్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. అమీర్‌పేట్ తహశీల్దార్‌గా పనిచేసిన భీమయ్య బదిలీపై రావడంతో కార్యాలయ అధికారులు, సిబ్బంది నూతన తహశీల్దార్‌ను శాలువాతో సన్మానించారు. ధ్రువీకరణపత్రాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటానని తహశీల్దార్ తెలిపారు.

- అడ్డగుట్ట

శతరుద్ర సహిత శతచండీ యాగం

తార్నాక డివిజన్‌లోని నాగార్జున నగర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహిస్తున్న శతరుద్ర సహిత శతచండీ యాగానికి నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి హాజరయ్యారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ యాగం మొదటి రోజు పాల్గొన్న ఆమెను యాగ నిర్వాహకులు సన్మానించారు. వేద పండితులు, అర్చకులు ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. డివిజన్ ప్రజలంతా సంతోషాలు, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని డిప్యూటీ మేయర్ ప్రార్థించినట్లు చెప్పారు. కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి పాల్గొన్నారు.

- ఉస్మానియా యూనివర్సిటీ

రాష్ట్ర బడ్జెట్ గోల్ మాల్‌గా ఉన్నది

సికింద్రాబాద్,జూలై 26: ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ గోల్ మాల్ బడ్జెట్ లాగా ఉందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రవిప్రసాద్ గౌడ్ శుక్రవారం ఎద్దేవా చేశారు. చెప్పుకోవడానికి రూ.2,91,159 కోట్ల బడ్జెట్ కాని, అందులో కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లు, సహకార సంఘాల నుంచి వచ్చే నిధులే రూ 70 వేల కోట్ల పైనే ఉన్నాయన్నారు. పెన్షన్ దారుల ప్రస్తావన తేకుండా వితంతువులు, వృద్ధులు, వికలాంగులను ప్రభుత్వం నిరాశపర్చిందని విమర్శించారు. రీజినల్ రింగు రోడ్డు కోసం కేంద్ర ప్రభుత్వం నిధులిస్తుంటే, బడ్జెట్ ప్రసంగంలో మాత్రం రాష్ట్ర ప్రభుత్వమే చేస్తున్నట్లుగా భట్టి విక్రమార్క ప్రకటించుకోవడం సిగ్గుచేటన్నారు. ఏ ఒక్క అసెంబ్లీ నియోజకవర్గం పేరును ప్రస్తావించకపోవడం దారుణమని చురకలు అంటించారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని గొప్పలకు పోయిన కాంగ్రెస్ సర్కారు, బడ్జెట్ లో ఆ ప్రస్తావనే తీయలేదన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేసే పాలసీలను ప్రకటించనే లేదని రవి ప్రసాద్ గౌడ్ మండిపడ్డారు.

భట్టి.. భరోసా లేని బడ్జెట్

అడ్డగుట్ట, జూలై 26 : రాష్ట్ర బడ్జెట్ అన్నివర్గాలను విస్మరించే విధంగా ఉందని బీఆర్ఎస్ నగర సంయుక్త కార్యదర్శి గుండవేణి రాజేశ్ గౌడ్(పెద్దన్న) అన్నారు. శుక్రవారం మెట్టుగూడ విజయపురి కాలనీలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రాజెక్ట్‌లకు కేటాయింపులో అలసత్వాన్ని ప్రదర్శించిందని, రైతుబంధు స్పష్టత లేకపోగా.. దళితబంధు ఊసే లేదని తెలిపారు. నిరుద్యోగ భృతి ప్రస్తావనే లేదని, మహిళలకు రూ.2500 ఆర్థికసాయంపై ప్రకటన చేయకపోవడంలో శోచనీయమని పేర్కొన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి 7.6శాతం మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు. ఇది ముమ్మాటికి ప్రజలను మోసం చేసే బడ్జెట్ అని ఆయన విమర్శించారు.

విద్యార్థులకు జేఈ టీకాలు

బోయిగూడ సున్నంబట్టి పాఠశాలలో టీకా వేసిన వైద్య శాఖ సిబ్బంది

బన్సీలాల్‌పేట్, జూలై 26 : మెదడువాపు వ్యాధి రాకుండా జపనీస్ ఎన్సెఫలిటీస్ (జేఈ) వ్యాక్సిన్ దోహదపడుతుందని గాంధీ పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.ప్రశాంతి అన్నారు. వైరస్ బారిన పిల్లలు పడకుండా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తొమ్మిది నెలల నుంచి 15 ఏండ్లలోపు పిల్లలకు జూలై 25 నుంచి ఆగస్టు 15 వరకు ప్రత్యేక డ్రైవ్ ద్వారా టీకాలు వేస్తున్నామని తెలిపారు. శుక్రవారం న్యూ బోయిగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సున్నంబట్టి ప్రాథమిక పాఠశాలల్లో టీకాలను వేశామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంలు కోటేశ్వర రావు, పుష్పలత, ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సన్మార్గంలో నడువాలి

యువత సన్మార్గంలో నడువాలని, చెడు మార్గాల్లో నడిపించే డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని తిరుమలగిరి సీఐ నాగరాజు అన్నారు. శుక్రవారం మాదకద్రవ్య వ్యతిరేక దినం పురస్కరించుకొని తిరుమలగిరి ప్రభుత్వ పాఠశాలలో డ్రగ్స్, జెండర్ సెన్సిటేషన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ నాగరాజు మాట్లాడుతూ.. ' డ్రగ్స్ వాడకం వద్దు ఆరోగ్యం ముద్దు ' అంటూ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రమాదేవి, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

- బొల్లారం

ముగిసిన క్రీడా పోటీలు..

ది సికింద్రాబాద్ పబ్లిక్ స్కూల్‌లో రెండు రోజుల పాటు కొనసాగిన క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. రుక్మిణీ బాయి స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో (టేబుల్ టెన్నిస్, కరాటే, వాలీబాల్, చెస్, క్యారమ్స్) జరిగిన పోటీల్లో నగరంలోని 100కు పైగా పాఠశాలల నుంచి 1100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పద్మాశాలి కల్యాణ మండపంలో జరిగిన బహుమతుల ప్రదాన కార్యక్రమానికి పాఠశాల సెక్రటరీ జ్యోతి మధుసూదన్‌రావు, హెచ్ఎం సుజాత ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. విజేతలకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేశారు.

- మారేడ్‌పల్లి

అభినందనలు

గాంధీ దవాఖాన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సీహెచ్.ఎన్.రాజకుమారిని శుక్రవారం చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ మర్యాదపూర్వకంగా కలిశారు. సూపరింటెండెంట్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. పీఎస్ పరిధిలో ఉన్న గాంధీ దవాఖానలో శాంతిభద్రతలను కాపాడడంలో తాము అన్నివిధాలుగా సహకారం అందిస్తామన్నారు. ఎమర్జెన్సీ బ్లాక్ వద్ద ఔట్ పోస్ట్‌లో పోలీసులు 24 గంటలు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు.

- బన్సీలాల్‌పేట్

ఎంబీఏ (ఎంఏఎం) రివాల్యుయేషన్ ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 26 : ఓయూ పరిధిలోని ఎంబీఏ (ఎంఏఎం) పరీక్షా రివాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షా రివాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఎంఫార్మసీ వన్‌టైం చాన్స్ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 26: ఓయూ లో ఎంఫార్మసీ పూర్తి చేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలి, కాలపరిమితి పూర్తైన వారికి వన్‌టైం చాన్స్ అవకాశం కల్పించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. 2000 తర్వాత ఎంఫార్మసీలో చేరినవారు సైతం తమ బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశమిచ్చామన్నారు. ఈ కోర్సుల అన్ని సెమిస్టర్ల పరీక్షా ఫీజును వచ్చే నెల 22 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. ఈ పరీక్షలకు సాధారణ పరీక్షా ఫీజుతో పాటు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్షా విధానంలోనే వారు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరీక్షలను సెప్టెంబర్‌లో నిర్వహించనున్నట్లు, పరీక్షా తేదీల పూర్తి వివరాలు త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇతర వివరాలకు వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా..

మడ్‌పోర్టులోని ప్రభుత్వ పాఠశాలలో ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

మారేడ్‌పల్లి, జూలై 26 : ట్రాఫిక్ నిబంధనలు పాటించాలనిగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ శంకర్ రాజు సూచించారు. ఏసీపీ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని శుక్రవారం కంటోన్మెంట్ మూడో వార్డు మడ్‌పోర్టులోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు '' రోడ్డు ప్రమాదాలు.. నివారణ '' అంశం పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. శంకర్ రాజు మాట్లాడుతూ.. రోడ్డు భద్రత, నియమాలను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని, అప్పుడే విద్యార్థి దశ నుంచి అవగాహన పెరుగుతుందన్నారు. ముఖ్యంగా 18 ఏండ్ల లోపు పిల్లలు (మైనర్లు) వాహనాలు నడపరాదని అది చట్టరీత్యా నేరమన్నారు. అలా వాహనం నడిపినచో తల్లిదండ్రులు, వాహన యజమానికి జైలుశిక్షతో పాటు రూ.25 వేల జరిమాన, వాహన రిజిస్ట్రేషన్ రద్దు చేయబడుతుందన్నారు. ఆటోలో ఐదుగురి కంటే ఎక్కువగా ఉన్నచో ఆ ఆటో ఎక్కవద్దని విద్యార్థులకు సూచించారు. కార్డిల్ విజయ్ దివస్ సందర్భంగా విద్యార్థులతో నిమిషం పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుప్రద, గణేశ్, భాస్కర్‌గౌడ్, ప్రభాకర్, పద్మజ, 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో వీరుల సైనిక్ స్మారక్ వద్ద 25వ కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శుక్రవారం బుధవారం అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా హెడ్‌క్వార్టర్స్ జనరల్ ఆఫీస్ కమాండింగ్, మేజర్ జనరల్ రాకేశ్ మనోచా హాజరై అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.

- మారేడ్‌పల్లి

కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని బొల్లారం బజార్‌లోని కార్గిల్ రాంచందర్ విగ్రహానికి టీపీసీసీ కార్యదర్శి నరసింహన్, సీనియర్ నాయకులు జి.వి.బాల్‌రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సతీశ్, సుశీల్, భీమన్న, ఎల్లయ్య, అశోక్ పాల్గొన్నారు

- బొల్లారం

రైల్లో చోరీకి పాల్పడిన దుండగులు

సికింద్రాబాద్‌లో ఫిర్యాదు చేసిన బాధిత మహిళ

మారేడ్‌పల్లి, జూలై 26: షిర్డీ సాయినగర్ నుంచి కాకినాడ పోర్టుకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైల్లో మూడు ఏసీ కోచ్‌లలో అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు దోపిడీకి పాల్పడ్డారు. ప్రయాణికుల వద్ద బంగారు, వెండి ఆభరణాలు, విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారు. కాకినాడ పోర్టు ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం సికింద్రాబాద్ చేరుకున్నది. బాధిత మహిళ సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. అన్నోజిగూడకు చెందిన భార్గవి కుటుంబ సభ్యులతో కాకినాడ పోర్టు ఎక్స్‌ప్రెస్ రైల్లో నగరానికి వస్తున్నది. అర్ధరాత్రి కావడంతో ప్రయాణికులు నిద్రిస్తున్నారు. రైలు మహారాష్ట్రలోని లాతూర్ రోడ్డు జంక్షన్ వద్దకు రాగానే.. దుండగులు రైల్లోకి ప్రవేశించి ఆమె బ్యాగ్‌లోని డైమండ్ రింగ్, యూఎస్ డాలర్స్, నగదు ఎత్తుకెళ్లారంటూ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు రైల్వే ఇన్స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ తెలిపారు.

బీదర్ వద్ద ప్రయాణికుల ఆందోళన..

రైల్లో దోపిడీ దొంగలు బంగారు, వెండి ఆభరాలను ఎత్తుకెళ్లడంతో ప్రయాణికులు బీదర్ వద్ద కొంతసేపు ఆందోళన చేసినట్లు రైల్వే ప్రయాణికులు తెలిపారు. దొంగలు బీదర్‌కు ముందున్న పర్లీ స్టేషన్‌లో దిగిపోయినట్లు రైల్వే పోలీసులు అనుమానిస్తున్నారు. దొంగతనం జరిగిన ప్రాంతం నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వరకు మధ్యలో ఉన్న రైల్వే స్టేషన్లలో ప్రయాణికులు దిగి ఆయా రైల్వే పోలీసు స్టేషన్లలో కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

వ్యక్తి అదృశ్యం

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 26 : మానసిక స్థితి సరిగా లేని వ్యక్తి అదృశ్యమైన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తార్నాక విజయపురి కాలనీలో ఏడాదిగా నిసార్ ఫాతిమా తన భర్త సయీద్ అబ్దుల్ అహద్ (56), పిల్లలతో కలిసి నివాసముంటున్నారు. గురువారం ఉదయం నిద్రలేచే సరికి తన భర్త కనిపించకపోవడంతో కంగారు పడిన ఫాతిమా చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో ఓయూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హఠాన్మరణం

బన్సీలాల్‌పేట్, జూలై 26 : పద్మారావునగర్‌లోని శ్రీ స్కందగిరి సుబ్రమణ్యస్వామి ఆలయంలో అడ్మిన్ మేనేజర్ స్వామి నాథన్ సురేశ్ (57) శుక్రవారం మల్కాజ్‌గిరిలోని తన నివాసంలో గుండెపోటుతో మృతి చెందారని ఆలయ వర్గాలు తెలిపారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారని, 12 ఏండ్లుగా స్కందగిరి ఆలయంలో విధులను నిర్వహిస్తున్నారన్నారు. ఆయన అకాల మరణం పట్ల వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ కృష్ణన్ రాజమణి, పీఆర్వో రాంబాబు, అర్చకులు తెలిపారు.

జీహెచ్ఎంసీలో విలీనమైతే అభివృద్ధి

మాట్లాడుతున్న వికాస్ మంచ్ అధ్యక్షుడు ఎబెల్, ప్రధాన కార్యదర్శి రవీందర్

మారేడ్‌పల్లి, జూలై 26 : కొందరు స్వార్థ రాజకీయాలు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం కంటోన్మెంట్ విలీన అంశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని కంటోన్మెంట్ వికాస్ మంజ్ అధ్యక్షుడు గడ్డం ఎబెల్, ప్రధాన కార్యదర్శి సంకి రవీందర్ అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ లక్ష్మీనగర్‌లోని వికాస్ మంజ్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం, రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కంటోన్మెంట్ అభివృద్ధికి నామమాత్రపు నిధులు కేటాయిస్తుందన్నారు. ఇక్కడి పౌరుల నుంచి పన్నుల ద్వారా ఆదాయాన్ని బోర్డు పొందుతుందన్నారు. ఇటు కేంద్రం, అటు రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కంటోన్మెంట్‌కి బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదన్నారు. కంటోన్మెంట్ సివిల్ ప్రాంతాలను జీహెచ్ఎంసీలో విలీనం చేయడం వల్ల మెరుగైన అభివృద్ధి, ఆత్మగౌరవం, మౌలిక సదుపాయాలు కల్గుతాయని చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టాలన్నా.. రక్షణ శాఖ, బోర్డు అనుమతి తప్పనిసరిగా ఉండడంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్ఎంసీ అభివృద్ధికి 15,594 కోట్లు కేటాయించిందని, 8 వేల కోట్లు ఆదాయ వనరులుగా జీహెచ్ఎంసీ ఉందన్నారు. కంటోన్మెంట్‌కు మాత్రం ఒక్క రూపాయి లేదని, జీహెచ్ఎంసీలో విలీనం అయితే కంటోన్మెంట్‌కు నిధులు వచ్చేవని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వికాజ్ మంజ్ ప్రతినిధులు అంబాల శ్రీనివాస్, మహ్మద్ ఫసుద్దీన్, అరుణ్ యాదవ్, రామడుగు దామోదర్, శివకుమార్ పాల్గొన్నారు.